APTEL/2009/29308

స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

శుక్రవారం 20-06- 2025

సంపుటి : 16 | సంచిక : 208 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 4 | వెల : రూ. 4 epaper.expresstelugudaily.com


## తిరుమలలో ఇకపై ఆర్టీసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం



**తిరుమల, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తిరుమలలో భక్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. తిరుమలలో భక్తుల నుంచి ప్రైవేటు వాహనాల వారు అధికంగా డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం.. తిరుమలలో బస్సులను ఉచితంగా నడిపేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషమయన్నారు. ఇందుకు ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు (ఉచిత బస్సులు) తిరిగే మార్గంలోనే ఆర్టీసీ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని వెల్లడించారు.


## పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యం



**తుర్కపల్లి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామమైన యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రిలో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నిరుపేదలకు 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. మొదటి విడతగా 4.5 లక్షల ఇళ్లు కట్టించాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలనలో 24 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నింటినీ పరిష్కరించనున్నట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్లను ప్రభుత్వం నియమించనుందని పేర్కొన్నారు.

### వాసాలమర్రిని కేసీఆర్ ఆగం చేశారు...

మాజీ సీఎం కేసీఆర్ దత్తత పేరుతో మాయమాటలు చెప్పి తన స్వార్థం కోసం ఫాంహౌస్‌కు వెళ్లేందుకు వీలుగా వాసాలమర్రిలో ఇళ్లు కూల్చి.. విశాలమైన రోడ్డు వేసుకున్నారని, గ్రామస్థులను ఆగం చేశారని మంత్రి ధ్వజమెత్తారు. ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పి... ఒక్క ఇల్లు కూడా కట్టకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గ్రామానికి 227 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వాసాలమర్రి వాసులతో సమావేశమైన సందర్భంగా గ్రామానికి చెందిన ఆకుల ఆగమ్మను అన్నివిధాలా ఆదుకుంటానని గతంలో సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ మాట ఇచ్చారని, దాన్ని నెరవేర్చలేదని మంత్రి విమర్శించారు. ఆగమ్మకు మంత్రి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేశారు. అయిలయ్య రూ.లక్ష సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ చైతన్య, కలెక్టర్ హనుమంతరావుతదితరులు పాల్గొన్నారు.





# మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

### బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి భేటీ

### 'తెలంగాణ రైజింగ్ విజన్'పై బ్లెయిర్ సంస్థతో ఎంవోయూ

**దిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు సత్వరమే అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం గురువారం ఇక్కడ కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. "వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండోదశ అవసరం చాలా ఉంది. రూ.26,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది కార్యరూపం దాలిస్తే నగరంలో రాకపోకలు వేగంగా సాగుతాయి. రహదారులపై రద్దీ తగ్గుతుంది. పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సూచనల మేరకు డీపీఆర్‌లో అవసరమైన సవరణలు చేసి సమర్పించాం. ఈ ప్రాజెక్టుకున్న అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచీ అవసరమైన అనుమతులు ఇప్పించండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి విన్నవించారు.

### 'తెలంగాణ రైజింగ్'కు టోనీ బ్లెయిర్ అభినందన

సీఎం రేవంత్‌రెడ్డి తన దిల్లీ పర్యటనలో యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్‌తో భేటీ అయ్యారు. 1997-2007 మధ్య యూకే ప్రధానిగా పనిచేసిన అనంతరం రాజకీయాల నుంచి వైదొలగిన బ్లెయిర్.. టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐజీసీ)ను స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నాయకులకు విజన్, వ్యూహాల రచన, వాటి అమలులో సహకరించడం దీని లక్ష్యం. ఇలా భారత్‌లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించడానికి బ్లెయిర్ దిల్లీకి వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో.. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంలోని కీలకాంశాలను బ్లెయిర్‌కి ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవమైన డిసెంబరు 9న విడుదల చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి వివరించారు. రైతులు, యువత, మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు, మానవాభివృద్ధి సూచికలను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు.

రాష్ట్రాన్ని పట్టణ, శివారు, గ్రామీణ జోన్లుగా విభజించి సూక్ష్మప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను బ్లెయిర్ అభినందించారు. భారత్ ఫ్యూచర్‌సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్' రూపకల్పనతోపాటు, దాని అమలులో పాలుపంచుకోవడానికి టీబీఐజీసీ, తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, రఘువీర్‌రెడ్డి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్‌రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీబీఐజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.


## నేడు ఎల్బీ స్టేడియంలో యోగా కౌంట్‌డౌన్ మహోత్సవం

### ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**నారాయణగూడ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఎల్బీ స్టేడియంలో కౌంట్‌డౌన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం భాజపా నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావులతోపాటు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని వివరించారు. సినీనటులు ఖుష్బూ, మీనాక్షి చౌదరి, సాయిదుర్గా తేజలు కూడా పాల్గొంటారని తెలిపారు.

## 'గోదావరి-బనకచర్ల అంశం'.. త్వరలో ఇద్దరు సీఎంల భేటీ ఏర్పాటు చేస్తామన్నారు: ఉత్తమ్



**దిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గోదావరి-బనకచర్ల చట్ట వ్యతిరేకమైన ప్రాజెక్టు అని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుపై దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు అభ్యంతరాలను తెలియజేసిన అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. "బనకచర్లపై ఆందోళనలను కేంద్ర మంత్రికి వివరించాం. ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రజలు, రైతుల్లో ఆందోళనలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా చూడమని కోరాం.

ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ లింక్‌తో పెన్నా బేసిన్‌కు నీరు తీసుకెళ్లొచ్చు. ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధాన అంశంపై చర్చకు సిద్ధమని చెప్పాం. త్వరలో ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి పాటిల్ హామీ ఇచ్చారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఇంకా అనుమతులు లభించలేదు. ఏపీ ప్రాజెక్టులకే త్వరగా అనుమతులిస్తున్నారని చెప్పాం. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరాం. రాష్ట్ర ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశాం. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క సారక్క, తుమ్మిడిహట్టికి కేటాయింపులు కోరాం" అని ఉత్తమ్ తెలిపారు.



## రాష్ట్రంలో గ్లోబల్ గుడ్‌గవర్నెన్స్ ఇన్‌స్టిట్యూట్

### ఏర్పాటుకు టోనీబ్లెయిర్ సంస్థ సహకారం • బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్, ఏపీ మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం

**దిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారం అందించడంపై ఏపీ ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌లు గురువారం దిల్లీలో ఒప్పందం చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన పత్రాలపై రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్.. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌ల సమక్షంలో ఇరుపక్షాలూ సంతకాలు చేశాయి. ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐ)ను ఏర్పాటుచేసి వివిధ రంగాల్లో ప్రపంచ దేశాలకు సాయం చేస్తున్న టోనీ బ్లెయిర్‌తో పలు అంశాలపై లోకేశ్ మాట్లాడారు. గత ఏడాది జులైలో బ్లెయిర్‌ను ముంబాయిలో లోకేశ్ కలిసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్ ఉపయోగించడానికి తమ సంస్థ తరఫున సహకారం అందించేందుకు ఆయన అంగీకరించారు. ఆ మేరకు విద్యారంగంలో ఆధునిక సాంకేతికతను అమలుచేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఏపీ విద్యాశాఖ, టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ 2024 డిసెంబర్‌లో ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగా టీబీఐ విజయవాడలో తమ బృందాన్ని నియమించుకొని గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏర్పాటు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో సంస్కరణలపై దృష్టి సారించింది. ఈ రెండు అంశాలపై జరిగిన పురోగతిని తాజాగా ఇద్దరు నాయకులూ సమీక్షించారు.



## దొంగను దొంగ అంటే ఒప్పుకొంటాడా?

**శ్రీకాకుళం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** 'మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీరు అలీబాబా 40 దొంగల కథ మాదిరిగా ఉంది. దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. శ్రీకాకుళంలో గురువారం కాంగ్రెస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని జగన్ అంటే ఎలా? తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మా ఇంటికొచ్చి ఫోన్ ట్యాప్ చేసిన ఆడియో వినిపించారు. బైబిల్‌పైన, నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెబుతున్నా. సుబ్బారెడ్డి చేతిలో ఆడియో ఎందుకుందో.. ఎలా వచ్చిందో ఆయన తన బిడ్డల మీద ప్రమాణం చేయాలి. ఈ విషయమై ఆయన్ను విచారణ చేయాలి. గతంలో నాకు సుబ్బారెడ్డితో సన్నిహిత సంబంధాలున్నాయి. అప్పుడే నాకు ఆడియో వినిపించారు.



# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతు భరోసా • కూసుమంచి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గత మూడు నాలుగు రోజుల నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతూ వస్తున్నాయని,రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతు భరోసా ఇస్తామని మరో రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలంగాణ రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.కూసుమంచి మండల పర్యటనలో భాగంగా నర్సింహుల గూడెం, పూరియా తండా,చింతల తండాలో బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పోచారంలో అంతర్గత సీసీ రోడ్లకు, కూసుమంచిలో అంతర్గత సీసీ రోడ్లకు,బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కూసుమంచి మండల కేంద్రంలో మంజూరైన జూనియర్ ప్రభుత్వ కళాశాల స్థలాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ..ఇందిరమ్మ రాజ్యంలో గతపాలకుల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని అన్నారు. 200 యూనిట్ల వరకు పేదలకు ఉచిత గృహ విద్యుత్ సరఫరా,రూ.500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ పథకం పరిమితి రూ.10 లక్షలకు పెంపు,గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం,కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంపు,సన్న వడ్లకు క్వింటాల్ రూ.500 రూపాయల బోనస్, గడిచిన ఉగాది నుండి రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.గత ప్రభుత్వం రైతులకు పెట్టుబడి క్రింద రూ.10 వేల రూపాయలు అందిస్తే,ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 12 వేల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు.గత ప్రభుత్వం చేసిన భారీ అప్పులను చెల్లిస్తూ పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని, అర్హులందరికీ దశల వారీగా తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు అందుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా,నియోజకవర్గ, మండల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిను కలసిన రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ నాయకులు ఎండి.సుల్తాన్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గత నెలలో ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రకు రాయికోడ్ మండలంలోని సింగీతం గ్రామానికి చెందిన రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ సుల్తాన్,వెళ్లి యోగ క్షేమలతో తిరిగివచ్చిన అనంతరం నేడు సాయంత్రం హైదరాబాద్ మహానగరంలోని మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ,వైద్యవిద్య శాఖ మాత్యులు సీలరపు దామోదర్ రాజనర్సింహ,ను మర్యాద పూర్వకంగా కలిసి వారికి హజ్ యాత్రలో ప్రత్యేక పనియమైన ఆబేజంజం నీరు,ఖార్జురలను ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ,అక్కడి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

## సిరికొండ తహసిల్దార్ కార్యాలయంలో అదనపు గదులు నిర్మించాలి



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రెవెన్యూ సదస్సులో అనివార్య కారణాలవల్ల దరఖాస్తులు ఇవ్వనివారు. 20వ తేదీ చివరి రోజు కావడంతో గురువారం అనేక మంది రైతులు తమ భూ పత్రాలను సమర్పించేందుకు సిరికొండ తహసిల్దార్ కార్యాలయాన్ని ప్రజలు రావడంతో కార్యాలయం పరిసర ప్రాంతం జనసంద్రంగా మారాయి. సుమారు 20 గ్రామాల రెవెన్యూ బాధ్యతలతో కూడిన ఈ మండల తహసిల్దార్ కార్యాలయం ఇరుకు గదులతో సిబ్బందికి తీవ్ర ఒత్తిడి ఎదురవుతుంది. ప్రజలు వరుసల్లో నిలబడి గంటల తరబడి వేచిచూసే పరిస్థితులు నెలకొనగా, కార్యాలయం ముందు గందరగోళం ఏర్పడింది. ఒక్కసారిగా ప్రజలు నడుస్తున్న సేవల వల్ల పౌరులు అసహనానికి లోనవుతున్నారు. “పౌరసేవలు వేగంగా పూర్తయ్యేలా మరొక భవనం నిర్మించాలి” అంటూ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రతిరోజు వందలాదిమంది కార్యాలయానికి వస్తు పోతుంటారు.కులం సర్టిఫికెట్ ఆదాయం సర్టిఫికెట్ వీటితోపాటు రిజిస్ట్రేషన్ చేయడం ఇలా ప్రతిరోజూ వచ్చి వేచి ఉండడం మనిషికే బాధాకరం.మరొక భవనం ఉంటే తక్షణ సేవలు అందుతాయనీ ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.ఇది ఒక్క రోజులో తలెత్తిన సమస్య కాదు..మౌలిక సదుపాయాల మెరుగుదల లేకపోవడమే కారణం అని గ్రామస్థులు వాపోతున్నారు.ప్రస్తుత తహసిల్దార్ కార్యాలయం పనిభారం భరించలేని పరిస్థితిలో ఉండటంతో,ప్రజలు అదనపు భవన నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.





## ఉచిత కంటి వైద్య శిబిరం...

- దామోదర్ రాజనర్సింహ త్రిష మణికంఠ పేరున వైద్య శిబిరం

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలంలోని గొల్ల కుంట తండా గ్రామంలో మానవ శరీరంలో అతి ముఖ్యమైన అవయవం కంటి చూపు అలాంటి కంటి చూపును అతి జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని వైద్యులు సూచించారు అల్లాదుర్గం మండలంలోని గొల్ల కుంట తండా గ్రామపంచాయతీలో క్లియర్ విజన్ కంటి ఆసుపత్రి,సంగారెడ్డి వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.కంటికి సంబంధించిన ఎలాంటి సమస్యకైనా చక్కటి పరిష్కారం లభిస్తుందని డాక్టర్ అమీర్ కంటి నిపుణుడు తెలిపారు. ప్రజలందరూ పాల్గొని ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ డాక్టర్ జాన్ సాయి మార్కెటింగ్ మహమ్మద్ అలీ,ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ సెక్రెటరీ ప్రియాంక, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అలిన్ భాష, గొల్ల కుంట తండా గ్రామ మాజీ సర్పంచ్ రాథోడ్ సోనీ శివరాం,జైపాల్ నాయక్, శంకర్ నాయక్, బాలు, సుభాష్,సంతోష్ నాయక్,తాండ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమజీవులంతా సంఘటితమై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి

- కార్మికవర్గ రాజ్యస్థాపనే టియుసిఐ లక్ష్యం
- టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** శ్రమజీవులంతా సంఘటితమై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని,కార్మికవర్గ రాజ్యస్థాపనే టియుసిఐ లక్ష్యంఅని టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుఎస్.ఎల్ పద్మఅన్నారు. గురువారం నాడు ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా (టియుసిఐ) నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా ప్రథమ మహాసభ లను సిరికొండ మండల కేంద్రంలోని కామ్రేడ్. ఎం.రాజేందర్ నగర్ ( ఎంఎన్ ఫంక్షన్ హాల్)లో నిర్వహించారు.ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్ పద్మ మాట్లాడుతూ.. దేశంలో శ్రమజీవులను శ్రమ దోపిడీకి గురి చేస్తు యాజమాన్యాలు కుబేరులు అవుతున్నారన్నారు. పాలక వర్గాలు కార్మిక వర్గాన్ని దోపిడీ చేసే కోటీశ్వర్ల కొమ్ముఖాస్తు నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. అదాని,అంబానీల మోచేతి నీళ్లు త్రాగుతు కార్మికులకు బలిపశువులను చేసే లేబర్ కోడ్స్ తీసుకొని రావడం సిగ్గుచేటు అన్నారు.ఇక్కడ బీడీ కార్మికులు జిపి వర్కర్స్ ప్రధానమైన కార్మిక రంగం ఉందని కార్మికుల పక్షాన టియుసిఐ సమరసియుల పోరాటం నిర్వహిస్తుందన్నారు. టియుసిఐ దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో నిర్మాణం కలిగి దేశకార్మికవర్గంలోనే బలమైన కార్మిక సంఘంగా ఉంది అన్నారు. అన్నిరకాల సంఘటిత, అసంఘటీత కార్మికులను ఐక్యం చేస్తు విప్లవ కార్మిక సంఘంగా ముందుకు వెళ్తుంది అన్నారు. అంతిమంగా కార్మిక వర్గ రాజ్యస్థాపనే లక్ష్యంగా పనిచేస్తుంది అన్నారు.



## అడవి నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తూంపల్లి సెక్షన్ వేస్ట్ బీట్ కంపార్ట్మెంట్ 513 నంబర్ నుండి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ మాచారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆసరి కిషన్,తెడ్ల చిన్న రాములు వీరిద్దరిని పట్టుకొని ఇసుకలోడుతో ఉన్న ట్రాక్టర్ ను తూంపల్లి సెక్షన్ ఆఫీసర్ కృష్ణ,బీట్ ఆఫీసర్ నాగేష్ సీజ్ చేసి భద్రత కొరకు సిరికొండ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు.పట్టుకున్న వ్యక్తులను పుచికత్తుపై వదిలిపెట్టినట్లు తెలిపారు.గ్రామస్తులు ఎవరైనా అటవీ ప్రాంతం నుండి అక్రమంగా ఇసుకను తరలించినట్లయితే ఫారెస్ట్ సెక్షన్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సిరికొండ రేంజ్ ఆఫీసర్ బి.రవీందర్ తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** దేశ భవిష్యత్తు కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ..బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం రవి అన్నారు.గురువారం రాహుల్ గాంధీ పుట్టిన రోజును సిరికొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మండల అధ్యక్షుడు బాకారం రవి మాట్లాడుతూ..భారత్ జోడోయాత్ర సందర్భంగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు మండుటెండలో వానలో చలిలో 4500 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసి శభాష్ అనిపించుకున్న రాహుల్ గాంధీ. దేశంలో బిజెపి అరాచకాలను పాలనను ఎండగట్టిన ఘనుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. దేశంలోని పేద బడుగు బలహీన వర్గాలను యువతను అభివృద్ధి వైపు నడిపించడమే లక్ష్యంగా మాన్యశ్రీ రాహుల్ గాంధీ మునుముందుకు మునుముందుకు వెళుతున్నారని కొనియాడారు. 2004 - 2009లో ప్రధానమంత్రిగా రెండుసార్లు అవకాశమొచ్చిన మాటకు కట్టుబడి మన్మోహన్ సింగ్ ను ప్రధాని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిసి కులగనన జరిగిందంటే రాహుల్ గాంధీ ఆదేశంతోనే అని అన్నారు. రాహుల్ గాంధీ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని యావత్ భారత ప్రజానీకం ఆశీస్సులు వారిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో రోండ్ల గోవర్ధన్, గ్యామ శోభన్, దిగంబర్, ఆసిఫ్, బాకారం సంతోష్,కేశిరెడ్డి శ్రీనివాస్, మల్లేష్ యాదవ్,ధూమాల గంగారెడ్డి,లియా కత్,గొల్ల జనార్ధన్, ములుగు అరుణ్,షేక్ జాఫర్,శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పునర్జన్మ...?

స్వర్గం నరకం
ఉందో లేదో తెలియదు
పుట్టిన ప్రతివారు రేపోమాపో
గిట్టక తప్పదని తెలుసు కాని
చనిపోయి తిరిగి బ్రతికిన వాడు
బ్రతికి మళ్ళీ భూమిపై జీవించినోడు
లేడు తరతరాలుగా ఒక్కడును లేడు
కాగడాపెట్టి వెతికినా కంటికి
కనిపించడు..!

కానీ కొందరు
అదృష్టవంతులు
పులినోట్లో తలదూర్చినా
సింహపు బోన్లో విసిరేసినా
విషసర్పాలు కాటేసినా
అగ్నిగుండంలో దూకినా
సురక్షితంగా బయట పడతారు..!

రైలు క్రింద వేగంగా వెళ్ళే
భారీ వాహనాల క్రింద పడి
నుజ్జునుజ్జైపోయిన వారున్నారు
సురక్షితంగా బయట
పడినవారున్నారు
ఔను మరి అదృష్టమంటే అదే కదా..!

ఈ మధ్య
గుజరాత్ లోజరిగిన
ఎయిర్ ఇండియా విమానం
రెక్కలు విరిగిన పక్షిలా
కుప్పకూలి పేలిపోగా...
265 మంది ప్రయాణీకులు
ముక్కలు ముక్కలైపోయారు
ఊపిరాడక విలవిల లాడిపోయారు
మంటల్లోచిక్కి మలమల
మాడిపోయారు.!

కానీ ఒకే ఒక్క ప్రయాణికుడు
మృత్యువు కోరలు చీల్చుకుని
మృత్యుంజయుడై బ్రతికి బట్టకట్టాడు
విశ్వమంతా ఒక్కసారి
విస్తుపోయేలా..!

అది కదా
పునర్జన్మంటే...
అదికదా
అదృష్టమంటే...!

అట్టి వారే కదా
అదృష్టజాతకులంటే...
అట్టి వారేకదా
నక్కను తొక్కినవారంటే...
అట్టి వారేకదా మృత్యువు తంతే
గారెలబుట్టలో పడినవారంటే..!

ఏదేమైనా ఎవరేమన్నా
చరిత్ర ఘోషిస్తుంది
జనన మరణాలు దైవాధీనాలని...
మనుషుల ప్రాణాలు
గాలిలో దీపాలని నీటిలో
బుడగలని...
పుణ్యమూర్తులకే పునర్జన్మని...!



రచన:
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య
కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్

# గదుల కొరతతో వరండాలోనే చిన్నారుల చదువులు



**పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత**
- పూర్తిగా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవన గదులు
- తరుచూ పాఠశాల కిటికీలు, డోర్లు ,కరెంట్ స్విచ్ బోర్డులను ధ్వంసం చేస్తున్న గుర్తుతెలియని దుండగులు
- పాఠశాలలో విద్యార్థులకు తీవ్రంగా త్రాగునీటి సమస్య
- గతంలో అర్ధాంతరంగా నిలిచిన మన ఊరు - మన బడి పనులు
- శిథిలమైన భవనంతో భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ పూట గడుపుతున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు
- శిథిలమైన భవనాన్ని కూల్చివేయాలని కోరుతున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి అటు విద్యార్థులు,ఇటు ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతూ క్షణక్షణం భయంగా భయాందోళన చెందుతూ ప్రతిరోజు పాఠశాలలో పూట గడుపుతున్నారు.ఈ పరిస్థితి సాక్షాత్తు పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నెలకొంది.ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు రెండు తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరి అత్యంత ప్రమాదకరంగా మారాయి.ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులుడుతూ ప్రతీ రోజు పై నుండి రోజుకు ఇంత కింద పడుతుంది.పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో ప్రస్తుతం మొత్తం 113 మంది విద్యార్థులు ఉండగా అందులో 45 మంది బాలురు, 68 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు.వీరికి గాను పాఠశాలలో మొత్తం 06 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.అదే విధంగా ఉర్దూ మీడియం పాఠశాలకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు కూడా ప్రస్తుతం పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ మీడియం విభాగంలో విద్యను అభ్యసిస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో మొత్తం 07 గదులు ఉండగా అందులో ప్రస్తుతం 2 గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.మిగతా 5 గదుల్లో 4 తరగతి గదుల్లో 4 తరగతులు 1 గదిని ఉపాధ్యాయులు,విద్యార్థులు స్టాఫ్ రూమ్,స్టోర్ రూమ్ గా ప్రస్తుతం వినియోగించుకొంటున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న మొత్తం 07 గదులలో 02 గదులు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.పాఠశాలలో పూర్తిగా శిథిలమైన భవనం ఉండడంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు ప్రతిరోజు బిక్కుబిక్కుమంటూ, ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయంతో,భయాందోళన చెందుతూ క్షణక్షణం భయం భయంగా పూట గడుపుతున్నారు.మరోవైపు ఆ భవనం వైపుకు విద్యార్థులు ఎవరు వెళ్లకుండా ఉపాధ్యాయులు ప్రతిరోజు విద్యార్థుల పట్ల జాగ్రత్తలు వహిస్తున్నారు.శిథిలమైన భవనం పాఠశాల ఆవరణలో ఉండడంతో అటు విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనతో చదువులు కొనసాగిస్తున్నారు.

**తరుచూ పాఠశాల కిటికీలను, డోర్ లను ధ్వంసం చేస్తున్న గుర్తు తెలియని దుండగులు**

పెద్దేముల్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఉన్న కిటికీలను,కిటికీ జాలీలను,డోర్లను, కరెంటు స్విచ్ బోర్డులను గుర్తు తెలియని దుండగులు తరుచూ ధ్వంసం చేస్తూ ప్రభుత్వ పాఠశాల ఆస్తికి నష్టం కలిగిస్తున్నారని పాఠశాల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పాఠశాల సమయం ముగిశాక గుర్తుతెలియని దుండగులు పాఠశాలలోకి చొరబడి పాఠశాల కిటికీలను, కిటికీలకు ఏర్పాటు చేసిన జాలీలను,తరగతి గదుల డోర్ లను,కరెంట్ స్విచ్ బోర్డులను తరుచూ పూర్తిగా ధ్వంసం ధ్వంసం చేస్తూ నష్టం కలిగిస్తున్నారని పాఠశాల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎన్నిసార్లు రిపేర్లు చేయించినప్పటికీ తరచూ గుర్తు తెలియని దుండగులు పాఠశాలలో ఉన్న కిటికీలను,తలుపులను పూర్తిగా ధ్వంసం చేసి నష్టం కలిగిస్తున్నారని వాపోయారు.

**మిషన్ భగీరథ పైప్ లైన్ ఉన్నప్పటికీ విద్యార్థులకు అందని త్రాగునీరు**

పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీరు అందుబాటులో ఉండడం లేదు. ముఖ్యంగా పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ పైప్ లైన్ ఉన్నప్పటికీ విద్యార్థులకు ప్రతిరోజు త్రాగునీరు అందడం లేదు.గతంలో విద్యార్థులకు త్రాగునీరు అందించడానికి మిషన్ భగీరథ పైప్ లైన్ ఏర్పాటు చేసినప్పటికీ అది పూర్తిగా వాడకంలో లేకపోవడంతో విద్యార్థులకు త్రాగునీటి సమస్య ఏర్పడింది.ప్రస్తుతం విద్యార్థులు ప్రతిరోజు తమ తమ ఇండ్ల నుండి వాటర్ బాటిల్ లను పాఠశాలకు తెచ్చుకొని దాహన్ని తీర్చుకొంటున్నారు. విద్యార్థులకు ఉన్న త్రాగునీటి సమస్యను తీర్చడానికి మిషన్ భగీరథ పైప్ లైన్ కు మరమ్మతులు చేయిస్తే విద్యార్థులకు ఉన్న త్రాగునీటి సమస్య తీరుతుందని పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.

గదుల కొరతతో వరండాలోనే కొనసాగుతున్న విద్యా బోధన పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉండడంతో ప్రస్తుతం పాఠశాలకు చెందిన 1వ తరగతి విద్యార్థుల విద్యాబోధన పాఠశాల ఆవరణలోని వరండాలోనే ప్రతిరోజు కొనసాగుతుంది.పాఠశాల ఉపాధ్యాయులు గదుల కొరత తీవ్రంగా ఉండడంతో చేసేదేమీ లేక,



ఎవరికీ చెప్పుకోలేక 1వ తరగతి విద్యార్థులను పాఠశాల వరండాలోనే కూర్చోబెట్టి, ఉపాధ్యాయులు కూడా అక్కడే కింద కూర్చొని విద్యార్థులకు విద్యా బోధనలు చేస్తున్నారు.ప్రస్తుతం వరండాలోనే 1వ తరగతి చిన్నారుల విద్యా బోధనతో ప్రతీరోజు పూట గడుస్తుంది.

**అర్ధాంతరంగా నిలిచిన మన ఊరు-మన బడి పనులు**

పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలను అప్పట్లో మన ఊరు-మన బడిలో భాగంగా ఎంపిక చేశారు.మన ఊరు- మన బడిలో భాగంగా పాఠశాలలో నీటి సౌకర్యం కోసం ఓ సంపును నిర్మించారు.తదుపరి పాఠశాలలో విద్యార్థుల త్రాగునీటి సౌకర్యార్థం నల్లాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా అప్పట్లో శాసనసభ ఎన్నికలు రావడంతో ఆ పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోయాయి.అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యార్థులకు పాఠశాలలో త్రాగునీరు సక్రమంగా అందక త్రాగునీటి సమస్య పెద్ద సమస్యగా ఉండిపోయింది. మరోవైపు మన ఊరు -మన బడిలో భాగంగా పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థుల త్రాగునీటి సమస్య ఇప్పటి వరకు తీరలేదు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు పెద్దేముల్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న తరగతి గదుల కొరత,విద్యార్థుల త్రాగునీటి సమస్య గురించి,గుర్తుతెలియని దుండగులు పాఠశాల కిటికీలను,కిటికీల జాలీలను, డోర్ లను, కరెంట్ స్విచ్ బోర్డులను, ప్రభుత్వ పాఠాశాల ఆస్తిని ధ్వంసం చేస్తున్న లాంటి సమస్యలపై స్పందించి సమస్యల పరిష్కారం కొరకు చొరవ చూపి తమ పిల్లలు చదువుతున్న పాఠాశాలకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులను వేడుకొంటున్నారు.

# విద్యార్థుల మధ్యాహ్న భోజనం కొరకే గ్యాస్ సిలిండర్,స్టవ్ ల వితరణ

- స్వంత డబ్బులతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గ్యాస్ సిలిండర్,స్టవ్ లను అందించిన ఖానాపూర్ హెచ్ఎం పి.అనిల్
- ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడి ఉదారస్వభావానికి ఖానాపూర్ గ్రామస్తుల అభినందనలు
- మధ్యాహ్నం భోజన నిర్వాహకులు విద్యార్థులకు సమయానికి రుచికరమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలి
- ఖానాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.అనిల్




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమయానికి,రుచికరమైన, పౌష్టికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకే మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు గ్యాస్ సిలిండర్,గ్యాస్ స్టవ్ లను అందించడం జరిగిందని ఖానాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.అనిల్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నటు వంటి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం సమయానికి అందించాలనే ఉద్దేశ్యంతో హెచ్ఎం.అనిల్ తన సొంత డబ్బులతో,జిల్లా పౌర సరఫరాల అధికారి అనుమతి పొంది మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గ్యాస్ సిలిండర్,గ్యాస్ స్టవ్ లను అందించారు.ఈ సందర్భంగా ఖానాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.అనిల్ మాట్లాడుతూ..ఖానాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగంగా,వారికి రుచికరమైన,పౌష్టికరమైన మధ్యాహ్నం భోజనం అందించడంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులను కండ్లతో స్వయంగా చూసి స్వంత డబ్బులతో గ్యాస్ సిలిండర్,గ్యాస్ స్టవ్ లను అందించడం జరిగిందని అన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు అందించిన గ్యాస్ సిలిండర్,గ్యాస్ స్టవ్ లను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని ఖానాపూర్ పాఠశాల విద్యార్థులకు సమయానికి, రుచికరమైన, పరిశుభ్రమైన, పౌష్టికరమైన మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం అందించాలని, విద్యార్థుల మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు.కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



# స్నేహిత ఎక్స్ ప్రెస్ కథనానికి స్పందించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- స్నేహిత ఎక్స్ ప్రెస్ ఎఫెక్ట్
- బుద్ధారం హై లెవెల్ బ్రిడ్జిపై తేలిన ఇనుప చువ్వలను మూసివేసిన ఆర్.అండ్.బి అధికారులు
- బ్రిడ్జిపై మరమ్మత్తుల పనులు చేపట్టాలని ఆర్.అండ్.బి ఈఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి
- బ్రిడ్జిపై మరమ్మత్తుల పనులు పూర్తి చేయించిన అధికారులు
- ఎమ్మెల్యేకు,ఆర్.అండ్.బి అధికారులకు, స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికకు ధన్యవాదాలు తెలిపిన ప్రయాణికులు
- వాహనదారులు,ఆయా గ్రామాల ప్రజలు


కోట్లు పోసి కట్టిన బ్రిడ్జిలో తేలిన ఇనుప చువ్వలు

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కోట్లు పోసి కట్టిన బ్రిడ్జిలో తేలిన ఇనుప చువ్వలు అనే శీర్షికతో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురించిన కథనానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పందించి వెంటనే బ్రిడ్జికి మరమ్మత్తులు చేయాలని ఆర్.అండ్.బి ఈఈ,ప్రస్తుత తాండూరు డీఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు.ఈ నెల 9న స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రిక లో "కోట్లు పోసి కట్టిన బ్రిడ్జిలో తేలిన ఇనుప చువ్వలు" అనే శీర్షికతో పెద్దేముల్ మండల పరిధిలోని బుద్దారం గ్రామ శివారులో ఉన్న హైలెవల్ బ్రిడ్జి గురించి స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించడం జరిగింది. స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి బుద్దారం బ్రిడ్జికి వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆర్అండ్ బి ఈఈ, ప్రస్తుత తాండూరు డీఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుతం బుద్దారం బ్రిడ్జి పై ఆర్.అండ్.బిఅధికారులు మరమ్మత్తుల పనులు చేపట్టి ప్రస్తుతం పూర్తిచేశారు.చాలా రోజుల నుండి పెండింగ్ లో ఉన్న బుద్దారం హైలెవెల్ బ్రిడ్జి మరమ్మతుల పనులు స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురించిన కథనంతో పూర్తి కావడంతో బ్రిడ్జిపై తేలిన ఇనుప చువ్వలను సిమెంట్, కంకర మిశ్రమంతో మూసివేయడంతో ఆ రహదారి మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు,వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ బ్రిడ్జి మరమ్మత్తుల విషయంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయానికి వెంటనే స్పందించిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి, ఆర్.అండ్.బి అధికారులకు, స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఎక్స్ ప్రెస్ ఎఫెక్ట్

# నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి యువత తోడ్పాటు అందించాలి

- గొట్లపల్లి పాఠశాలలో ఘనంగా బంగారు నవీన్ జన్మదిన వేడుకలు
- గొట్లపల్లి పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్ లు,ఇతర సామాగ్రిని అందించిన మండల బీసీ సంఘం యువజన అధ్యక్షుడు బంగారు నవీన్

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** యువత నిరుపేద విద్యార్థుల చదువుల పట్ల తమ సహాయ సహకారాలను అందించడానికి ఎల్లప్పుడూ ముందుడాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకూర్,తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, లెక్చరర్ తెలుగు మహేందర్ అన్నారు.గురువారం పెద్దేముల్ మండల బీసీ సంఘం యువజన అధ్యక్షుడు బంగారు నవీన్ తన జన్మదిన వేడుకలను స్థానికంగా ఉన్న గొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా జరుపుకొన్నారు.బంగారు నవీన్ తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గొట్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు బుక్ లను,ఇతర సామాగ్రిని అందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..గొట్లపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు,పెద్దేముల్ మండల బీసీ సంఘం యువజన అధ్యక్షుడు బంగారు నవీన్ తన జన్మదిన వేడుకలను మారుతున్న కాలానికి అనుగుణంగా హంగు, ఆర్భాటాలతో జరుపుకోకుండా తన స్వంత గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మధ్య జరుపుకోవడం అభినందనీయమని,అదేవిధంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇతర సామాగ్రిని అందించడం గొప్ప విషయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుల పట్ల యువత సహాయ సహకారాలను అందించడానికి ఎల్లప్పుడూ ముందుండి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్లోబల్ యువతరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అరుణ్ రాజ్,పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు వెంకట్, రాంరెడ్డి, నర్సింహులు, నరేష్,పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు బోధన సౌకర్యాలు

- హెచ్ఎమ్ జగదీశ్వరయ్య

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కార్పోరేట్, ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా అర్థవంతమైన బోధనను నిష్ణతులైన అధ్యాపకులచే బోధన ఉంటుందని 2023 సం,ర రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,రంజోల్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాద్యాయులు పెందోటి జగదీశ్వరయ్య అన్నారు. గురువారం నాడు జహీరాబాద్ పట్టణ పరిధిలోని రాంజోల్ వార్డులో బడిబాట కార్యక్రమంలో భాగంగా హెచ్ఎమ్ పి.జగదీశ్వరయ్య ప్రైవేట్ పాఠశాల జహీరాబాద్ లో చదివే ఇద్దరు 3వ మరియు 5వ తరగతుల విద్యార్థులను ఆపి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే కలిగే లాభాలు మరియు ప్రత్యేకంగా తమ ప్రాథమిక పాఠశాల రంజోల్ యొక్క ప్రాముఖ్యత తెలియజేసి, విద్యార్థుల విద్యాభివృద్ధికి మా వంతు కృషి వంద శాతం ఉంటుందని,విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు సమాకురుస్తామని నమ్మకం కల్గించి పాఠశాలలో చేర్చుకోవడమైనది, ఈ విధంగా బడిబాటలో ఉదయం 7 గంటల నుండి గ్రామంలో బ్యానర్లతో,సర్కారు బడి యొక్క ప్రాముఖ్యతను తెలిపే ఆట పాటలతో పాఠశాల టీచర్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినయకుమారి, అఖిల్ అహ్మద్,శకుంతల, సాబీహాబేగం,శైహిస్త రూహి, మంజుల,స్వప్నజ్యోతి,హఫీజ్ అహ్మద్ గార్లు ప్రతీ ఇంటిని సందర్శించి 35 అడ్మిషన్స్ చేసుకోవడైనది,బడిబాట షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు రోజువారీగా నిర్వహించడం జరిగింది. మరో 15 అడ్మిషన్స్ చేయాలనే పట్టుదలతో ఉన్నామని ప్రధానోపాధ్యాయులు పి.జగదీశ్వరయ్య తెలియజేశారు.